

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

**జై భారతీ వందే భారతీ**

**సర్ పే హిమాలయ్ కా ఛత్ర్ హై**

**చరణోమే నదియా ఏక్‌త్ర్ హై**

**హాథోంమే  వేదోంకా  పత్ర హై**

**దేశ్ నహీ ఐసా అన్యత్ర**

'దేశభక్తి' పాటలలో అగ్రస్థాయిలో నిలబడాల్సిన గీతం ఇది. 1955లో విడుదలయిన జగద్గురు ఆదిశంకరాచార్య సినిమా కోసం లతా మంగేష్కర్ గానం చేసిన గీతం ఇది. సంగీత దర్శకుడు అవినాశ్ వ్యాస్. గేయ రచయిత భరత్ వ్యాస్. అభి భట్టాచార్య. సులోచన ఛటర్జీలు ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమానే కాదు, ఈ సినిమాలోని అత్యద్భుతమైన పాటలు కూడా విస్మృతిలో పడ్డాయి.ఇందుకు ప్రధాన కారణం సినీ విశ్లేషకులు, సినీ విమర్శకులు తెలిసో తెలియకో కొన్ని సినిమాల గురించి కొన్ని పాటలు, కొందరు సంగీత దర్శకులు, గేయ రచయితల  గురించి పదే పదే ప్రస్తావిస్తూ, అధ్యయనానికి పరిశోధనకు ప్రాధాన్యం ఇవ్వకపోవటం.

కొందరు గేయ రచయితల జీవితాలు ఆకర్షణీయంగా ఉండటం,  వారు తెలివిగా తమ జీవితాలకు సంబంధించిన విషయాలను ఆకర్షణీయంగా ప్రచారంలో ఉంచటం వల్ల అధికులు వారి గురించే ప్రస్తావిస్తారు. పైగా, లోతైన అధ్యయనం లేకుండా ఒక విమర్శకుడు రాసిన దాన్నే తరువాత వారు వల్లె వేస్తూండటం వల్ల కూడా  అనేక అత్యద్భుతమైన గీతాలు, కళాకారులు మరుగున పడుతున్నారు ముఖ్యంగా, గేయ రచయితలనగానే సాహిర్, శైలేంద్ర, మజ్రూహ్, శకీల్  వంటి వారి పేర్లే, ప్రస్తావనకు వస్తాయి. నిజానికి గేయ రచయితలనగానే గుర్తుకు రావాల్సిన జాబితాలో కవి ప్రదీప్, భరత్ వ్యాస్ వంటి వారి పేర్లు అగ్రస్థానంలో ఉండాలి. ఎందుకంటే, ఇతర గేయ రచయితలకు భిన్నంగా కవి ప్రదీప్, భరత్ వ్యాస్‌లు

తమ గేయ రచనలో శుద్ధమయిన భాషను, పరిశుద్ధమయిన ఉన్నతమైన  భావనలను మాత్రమే పొందుపరచారు. ఎలాంటి గీతమైనా ఒక స్థాయికి ఎదిగింపచేసే భావనలతో, సుందరమైన పదాలతో రచించారు. సాహిత్య పరంగా అత్యుత్తమ స్థాయి గీతాలు రచించారు. సాధారణమైన భావాల్ని కూడా అసాధారణమైన రీతిలో ప్రదర్శించి ప్రేక్షకుల స్థాయిని పెంచారు. అందుకు చక్కని నిదర్శనం 'జై భారతీ వందే భారతీ ' గీతం.

'దేశభక్తి' గీతాలంటే భరత్ వ్యాస్ విజృంభించి రాస్తాడు. భక్తిగీతాలు, తాత్త్విక గీతాలంటే సర్వం మరచి అతని భావనాబలం విశృంఖల విహారం చేస్తుంది. జాతీయ భావనల పూదోటను విరగపూయిస్తుంది.

'జై భారతీ' పాటలో పదాలు కేవలం ప్రాసకోసం రాసినవి కాదు. ప్రతిపదం ఎంతో ఆలోచనతో, గూఢార్థాన్ని తనలో పొదుగుకున్నది. భారత శిరస్సుపై హిమాలయాలు గొడుగులా ఉన్నాయి. చరణాల వద్ద నదుల సంగమం ఉంది. కరాలలో వేదాలున్నాయి. ఇది దేశం కాదు స్వర్గం. 'అన్యత్ర' అన్న పదం వాడకం పాటకు ఒక ప్రత్యేక శోభనిస్తుంది. హిందీ సినీ గేయాలలో ఈ పదం వినబడే ఏకైక గీతం ఇది. 'అన్యత్ర' అంటే ' ఇలాంటిది ఇంకెక్కడా లేదు  అన్న సామాన్యార్థం  ఉంది. అంటే 'ఇక్కడిది కాదు ఎక్కడిదో' అన్న అర్థం వస్తుంది. కానీ ప్రాచీన శాసనాలను పరిశీలిస్తే 'అన్యత్ర' అన్న పదాన్ని భారత దేశాన్ని ఉద్దేశిస్తూ వాడటం కనిపిస్తుంది. 'అన్యత్ర' అన్న పదాన్ని  'భూతల స్వర్గం' అన్న అర్థంలో వాడటం కనిపిస్తుంది. అంటే ఇలాంటి దేశం ఈ భూగోళంలో మరెక్కడా లేదన్న అర్థం వస్తుంది.  ఇక జాతీయ భావనలను తన గేయాలలో ప్రదర్శించటంలో భరత్ వ్యాస్‌కు మించిన వారు లేరని 'నవరంగ్' సినిమా ఆరంభ గీతం ప్రదర్శిస్తుంది.

**న రాజా రహేగా, న రాణీ రహేగీ**

**యె దునియా హై ఫానీ, ఔర్ ఫానీ రహేగీ**

**న జబ్ ఏక్ భీ  జిందగానీ రహేగీ**

**తో మాటీ సభీకీ కహానీ కహేగీ.**

ఈ మట్టి అందరి గాథలు చెప్తుందట. అద్భుతమైన భావన. రాజులు మట్టిలో కలిసిపోతారు. భవనాలు మట్టిలో కలిసిపోతాయి. ఉజ్జ్వలమైన నాగరికతలు మట్టిపాలవుతాయి. అందుకే, అందరినీ తనలో ఇముడ్చుకున్న మట్టి, అందరి కథలనూ చెప్పగలుగుతుంది. వైజ్ఞానిక దృష్టితో చూస్తే కూడా మట్టి బోలెడన్ని సత్యాలను ఆవిష్కరిస్తుంది. ఆ ప్రాంతం ఎలా

ఏర్పడిందో దగ్గరనుంచి, ఏయే రాజ్యాలు రాజులు ఆ ప్రాంతంలో ఉన్నారో, ఎలా పాలించారో, ప్రజల ఆహార వ్యవహారాలు సర్వం మట్టిని శోధిస్తే తెలుస్తాయి. అందుకే ఎవరున్నా లేకున్నా మట్టి ఉంటుంది. అందరి కథలూ చెపుతుంది.

**దిఖేగీ రాణాకి రణ్ కీ నిషానీ**

**కహేగీ శివజీ కె ప్రణ్ కీ కహానీ**

**బతలాయేగీ ముఘలోంకి బాతే అన్‌జానీ**

**ఉస్ గద్దార్ జయ చంద్ర కీ జిందగానీ**

**యె అపస్‌కి సబ్ బద్ధమానీ కహేగీ**

మట్టి ఏమేం గాథలు చెప్తుందో అత్యద్భుతంగా వివరిస్తుందీ చరణం. భారత దేశ చరిత్ర విదేశీయులు నిర్మించింది. భారత చరిత్రను వారు తమ దృష్టిలో నిర్మించారు. ఇది భారతీయులనేకులకు అమోదయోగ్యం కాదు. ప్రపంచ వ్యాప్తంగా విదేశీయుల ఆధిక్యంలో అణగిన నాగరికతల పరిస్థితి ఇది. విదేశీయులు ఆయా దేశాలపై పట్టు సాధించాలంటే వారి ఆత్మ విశ్వాసాన్ని దెబ్బ తీయాలి. అందుకు చరిత్రను వారు ఒక ఆయుధంలా వాడుకుంటారు. భారతదేశంలోనూ అదే జరిగింది. విదేశీయులు నిర్మించిన అబద్దాల చరిత్ర, ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే తప్పులు తడకల చరిత్రను భారతీయ జాతీయ వాదులు అమోదించలేదు. ముఖ్యంగా, భారత స్వాతంత్ర పోరాటాన్ని నూతన స్థాయికి ఎదిగించి, ఆత్మగౌరవం, ఆత్మ విశ్వాసాలకు ప్రాధాన్యం ఇచ్చిన శివాజీ మహరాజ్ నడయాడిన నేల మహారాష్ట్రంలో ఈ జాతీయ భావనలు తీవ్రంగా ఉన్నాయి. శాంతారాం, భరత్‌వ్యాస్, సి. రామచంద్ర వంటివారు తమ సినిమాలలో ఈ జాతీయ భావనలను సందర్భం వచ్చినప్పుడల్లా ప్రదర్శించారు. అవకాశం దొరికినప్పుదల్లా ఆధ్యాత్మక భావనలను అందించారు.

'యె మాటీకీ సభీకీ కహానీ కహేగీ'లో పదాల వాడకం అద్భుతం. 'రణ్, ప్రణ్' అన్న పదాలు పైకి కనబడే అర్ధంకాక ఎంతో లోతైన భావాల్ని ప్రదర్శిస్తాయి. 'రాణానీ రణ్', రాణా ప్రతాప్ రాజనీతి గురించి చెప్తుంది. ఎన్ని కష్టాలెదురయినా తల వంచక, ఆత్మగౌరవ పోరాటం జరిపాడు రాణా. ఓడిపోతానని తెలిసి కూడా పోరాడుతూనే ఉన్నాడు. తల వంచలేదెపుడూ. 'శివాజీ కె ప్రణ్ '... ప్రణ్ ' అంటే ప్రతిజ్ఞ. శివాజీ అవసరమైతే, శత్రువును కౌగిలించుకుని వెన్నులో కత్తిని దింపి మరీ విజయం సాధించాడు. 'గెలవటం' శివాజీ ప్రతిజ్ఞ. ఓడినప్పుడు తలవంచినట్టు నటించి వీలు చిక్కగానే తల నరికి విజయం సాధించాడు. ఓడిపోతానని తెలిసి మరీ తలవంచని రణనీతి రాణాదయితే, ఓటమిని విజయంగా

మలచుకునే 'ప్రణనీతి' శివాజీది. మొఘలుల పాలనను చరిత్ర రచయితలు గొప్పగా వర్ణిస్తారు. కానీ వారి పాలనలో చరిత్ర చెప్పని విషయాలను మట్టి చెప్తుందట. అంతేకాదు, 'ఆపస్‌కీ సబ్ బద్గుమానీ' అంటే చరిత్ర రచయితలు కుట్ర పూరితమైన దురుద్దేశ్యాలతో చేసిన 'బద్‌గుమానీ' evil presumptions అన్ని ఈ మట్టి తెలుపుతుందట.

ధూప్సే పావన్ యే వ్యోం హై

ఘర్ ఘర్ మే హోతా జహా హోమ్ హై

పులకిత హమారే రోం రోం హై

ఆది అనాది శబ్ద్ ఓం హై

జై భారతీ వందే భారతీ

భారతదేశం ప్రత్యేకతను, గొప్పతనాన్ని పవిత్రతను ఎంతో గొప్పగా వర్ణించాడు భరత్ వ్యాస్. 'ధువేసే పావన్' అంటే ఉదయపు పొగమంచు అంతటి పవిత్రం ఈ ప్రాంతం. ఇక్కడి జన్మించినందుకు శరీరం పులకితమవుతుంది. ఇక్కడి అనాది శబ్దం 'ఓం' అంటే, భారత దేశం ఎంత ప్రాచీనమో, ఎంత పవిత్రమో, హోమాల వల్ల ఈ భూమి వాతావరణం ఎంతగా పవిత్రమయ్యాయో చెప్తున్నాడు కవి. దీనికి పూర్తిగా విరుద్ధమైన భావన, అమె, ఆత్మగౌరవాన్ని దెబ్బతీయాలనే విదేశీ ప్రయత్నాలను తిప్పికొడుతూ శబ్దాలను తుపాకీ గుళ్ళలా వాడుతున్నాడు కవి భరత్ వ్యాస్.

జో థే దేశ్ దుష్మన్ గులామీ కె రాహీ

లగే ఫేర్‌నే ఇస్ వతన్ పర్ స్యాహీ

విదేశోకీ కర్నేలగే వాహావాహీ

గయా దేశ్ హోథోసే అయీ తబాహీ

యే భర్‌భర్‌కె ఆంఖోమె పానీ కహేగీ

యె మాటీ సభీకీ కహానీ కహేగీ

ఓ వైపు వ్యోమ్, హోమ్, ఓమ్ లతో రోమ్ రోమ్ పులకితమౌతుందంటూనే బానిస మనస్తత్వంతో విదేశీయుల భావనల గులాంగిరీలో మ్రగ్గుతూ వారు చెప్తున్న తప్పుడు తడకల చరిత్రనే సరైనదంటూ, మనదేశపు గొప్పతనాన్ని కించపరుస్తూ, మనల్ని మనం నీచులుగా భావించేట్టు చేస్తూ , గొప్పతనమేమీ మనకు లేదని, భ్రమింపచేస్తూన్నవారి కథలను కూడా కన్నీటితో చెప్తూందట ఈ మట్టి.

**జిస్ భూమి పే జనం లియే రామ్ నే**

**గీతా సునాయో జహాన్ శ్యామ్ నే**

**పావన్ బనాయా చారో థామ్ నే**

**స్వర్గ్ భీ న ఆయే జిస్కీ సామ్ నే**

**వందేమాతరం... వందేమాతరం.**

గమనిస్తే రాముడు జన్మించిన పవిత్రమైన భూమి ఇది, శ్రీకృష్ణుడు గీత ప్రవచించిన పావనమైన ధాత్రి ఇది, 'చార్ థాం'లున్న అత్యద్భుతమైన భూమి ఇది అని మనం గర్విస్తాం. కానీ ఒక పద్ధతి ప్రకారం రాముడు, రామాయణాలపై దుర్వ్యాఖ్యానాలు సాగుతున్నాయి. రాముడంటే సిగ్గుపడుతూ, అసలు రామాయణం ఏదనే సందిగ్ధానికి గురయ్యే పరిస్థితులు కలుగుతున్నాయి. 'చార్థామ్'ల విషయానికొస్తే దైవం, దేవాలయాలు సైతం దుర్వ్యాఖ్యానాలు, ఎదుర్కోవాల్సి వస్తోంది. అంటే, ఏయే అంశాల ఆధారంగా మనం గర్విస్తామో, ఆత్మవిశ్వాసం ఇనుమడిస్తుందో, ఒక పద్ధతి ప్రకారం ఆయా అంశాలను మన దృష్టిలో దిగజార్చే ప్రయత్నాలూ అంతే ముమ్మరంగా సాగుతున్నాయన్నమాట.

**ఫిర్ స్వతంత్రకా ఇస్ సంగామ్ ఆయా**

**కీ హర్ ఆద్మీ దేశ్ కే కామ్ ఆయా**

**లడీ వీర్ ఝాన్సీకి రాణీ భవానీ**

**హజారో నే లాఖోంనే జౌహర్ జలాయా**

**యే ఖుర్బానియా ఖుద్ జుబానీ కహేగీ**

**యె మాటీ సభీకీ కహానీ కహేగీ**

జాతీయ భావాలను అణచి దేశ ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నాలపై పదాలను శరాలుగా, భావాలను వజ్రాయుధాలుగా మలచి భరత్ వ్యాస్ వదలిన ఆయుధాలు ఆయన గీతాలు. స్వతంత్ర సంగ్రామంలో ప్రతి పౌరుడూ ఒక జ్వాల అయి ఆత్మార్పణ చేసుకున్నాడు. భవానిలా ఝాన్సీరాణి శత్రువుపై విరుచుకు పడింది. బోలెడంతమంది ప్రాణత్యాగం చేశారు. వారి త్యాగాలే వారి గాథలు చెప్తాయి. ఆ గాథలన్నీ ఈ మట్టి చెప్తుంది. అయితే, 1857 పోరాటాన్ని ప్రథమ స్వాతంత్ర సంగ్రామం అనగానే వెంటనే అది స్వతంత్ర పోరాటం కాదు, సిపాయిల తిరుగుబాటు అంటారు. ఎలాగయితే, రాముడు, రామాయణం, కృష్ణుడు, గీతవంటి వాటిని తక్కువ చేస్తారో, అలాగే ప్రథమ స్వతంత్ర పోరాటాన్నీ రాజుల రాజ్యకాంక్షల కోసం జరిపిన వ్యక్తిగత పోరాటంలా వర్ణించి తప్పుదారి పట్టిస్తారు. దానికీ సమాధానం ఇచ్చాడు భరత్ వ్యాస్ తన గీతం ద్వారా.

**జిలాదో ఇతి హాస్ ఝూటే తుమ్హారా**

**యహా పే జర్రె జర్రె పె సబ్ హై లిఖారే**

**జులం వో తుమ్హారే, సితం వో తుమ్హారే**

**కరో యాద్ ఉఫ్ కార్ నామో వో సారే**

**కె పథ్థర్ సే అసూ కి ధారా బహేగీ**

**యె మాటీ సభీకీ కహానీ కహేగీ**

ఆ చెత్త, అబద్ధపు, తప్పుల తడకలుగా సృష్టించిన చరిత్రను తగులబెట్టండి. ఇక్కడి అణువణువూ అసలు చరిత్ర చెప్తుంది. మీ దుష్ట చర్యలు అబద్దాలు, కుతంత్రాలకు ఇక్కడి రాళ్లు కూడా కరిగి అశ్రుధారలు కారుస్తాయి అంటున్నాడు భరత్ వ్యాస్. నిజానికి 1857 చరిత్ర మరుగున పడింది. ఇక్కడి ప్రజలు ఆ పోరాటంలోని వీరులను, నిజానిజాలను మరచిపోయారు. అలా విస్మృతిలో పడిన అసలు చరిత్రను వెలుగులోకి తెచ్చింది వీర సావర్కర్. ఆయన పరిశోధించి వెలికి తేకపోతే ఝాన్సీరాణి, తాంతియా తోపే వంటి వీరుల గాథలు మనకు తెలిసేవి కావు. ఆ నిజాలను వెలుగులోకి

తెస్తున్నాడని సావర్కర్‌ను అండమాన్ పంపింది బ్రిటీష్ ప్రభుత్వం. అతని పుస్తకాన్ని ప్రచురణకు ముందే నిషేధించింది. అయినా ఆ పుస్తకం భారత్ చేరింది. ప్రతి ఒక్కరిలో దేశభక్తి రగిలించింది. అలాంటి సారర్కర్ పేరు ఎత్తితే ఈనాడు భరించలేని బానిసలు దేశంలో ఉన్నారు. వారిని విమర్శిస్తున్నాడు భరత్ వ్యాస్. వారి 'జులం', 'సితం'లకు రాళ్లుకూడా కన్నీళ్లు కారుస్తాయట. అయినా సరే తాము చెప్తున్న చరిత్రనే సరైనది అంటూ వితండ వాదం చేసే వారిని పదాలను శరాలుగా చేసుకుని విమర్శించాడు భరత్‌వ్యాస్.

యె మాటీ హై తబ్ సే నజబ్ తుం థె ఆయె

యె మాటీ రహేగీ న జబ్ తుం రహోగే

ఇస్ మాటీ కె సీనేమే దబీ హై కథాయే

యె ఖుద్ హీ కహేగీ రే తుం క్యా కహోగే

జమీన్ అస్మాన్ థర్ థరాకే రహేగీ

యె మాటీ సభీకీ కహానీ కహేగీ..

తమకు తెలిసిందే సరైన చరిత్ర, తాము చెప్తున్నదే నిజంగా జరిగిందని, తమ ఊహలు అపోహలతో చరిత్రను సృష్టించే వారందరికీ సవాల్ విసురుతున్నాడు కవి. ఈ మట్టి అనంతకాలం నుంచీ ఉంది. ఆది శబ్దం 'ఓం' ఇక్కడే జన్మించింది. అది నువ్వు పుట్టుక ముందు నుంచీ ఉంది. నువ్వు పోయిన తరువాత కూడా ఉంటుంది. అసలు నిజం కాలమే చెప్తుంది. ఈ చరిత్ర నువ్వేం చెప్తావు? అసలు నిజం తెలిసినప్పుడు భూమి కంపిస్తుంది. ఆకాశం వణుకుతుంది. కాబట్టి, అబద్దాల చరిత్రను నిజమని నమ్మించే ప్రయత్నం చేయవద్దనీ, మట్టిలో దాగి ఉన్న గాథలను వెలికి తీసి సత్యాలను ప్రకటించమనీ అంటున్నాడు కవి.

ఇలాంటి గాఢమైన దేశభక్తి, స్వచ్ఛమైన జాతీయ భావాలను నిర్ద్వంద్వంగా ప్రకటించిన కవిని, ప్రదర్శించిన కళాకారులను దేశం నెత్తినపెట్టుకుని పూజించాలి. స్వచ్ఛమైన, సరళమైన భాషలో తరళమైన భావాలను, చేదు నిజాలను నిక్కచ్చిగా ప్రదర్శించే గేయ రచయితను ఉన్నత స్థానంలో ఉంచాలి. కానీ, భారతీయ సమాజంలో లోపాలెంచి, దూషించి, విచ్ఛిన్నకరమైన భావాలను ప్రకటిస్తూ, ఆత్మవిశ్వాసాల్ని దెబ్బతీసే కళాకారుల కళాప్రదర్శనకున్న విలువ

జాతీయ భావాలు ప్రదర్శిస్తూ, దేశపు గొప్పతనాన్ని వివరిస్తూ, ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసాలను పెంపొందించాలని కవిత్వాన్ని ఆయుధంలా చేసుకున్న కవులకు ఉండదు. అందుకు ప్రధాన దృష్టాంతం భరత్ వ్యాస్. ఇలాంటి గంభీరమైన ఆలోచనతో, బాధాతప్త హృదయంతో ఉన్న వారికీ వారు బాధను మరచి సత్యపథం వైపు ప్రయాణించే మార్గాన్ని కూడా భరత్ వ్యాస్ సూచించాడు 'అంగులిమాల' సినిమాలోని పాటతో..

జబ్ దుఖ్ కీ ఘడియా అయీ

సబ్ పర్ ఝూట్ విజయ్ పాయీ

ఇస్ నిర్మల్ పావన్ మన్ పర్

జబ్ కళంక్ కే ఘన్ ఛాయీ

అన్యాయోం కి ఆంధీ సే

కాన్ ఉఠే జబ్ తేరే ఢోల్

తబ్ మానవ్ తూ ముఖ్ సే బోల్

బుద్ధం శరణం గచ్ఛామి

ధర్మం శరణం గచ్ఛామి

సంఘం శరణం గచ్ఛామి.

(వచ్చే నెల మరిన్ని మధురమైన పాటలతో)

Click here to share your comments